విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

సోమవారం 10 జూన్ 2024 8 పేజీలు

యర్రగొండపాలెం వైసీపీ కంచుకోట

ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : ఆదరించిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. విపత్కర పరిస్థితులలో కూడా పెద్ద ఎత్తున అండగా నిలబడి ఎమ్మెల్యేగా తన గెలుపునకు కృషిచేసిన ప్రతి ఒక్క వైకాపా నేతకు, కార్యకర్తకు యర్రగొండ పాలెం నియోజకవర్గ ప్రజలకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ముందుగా వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం యర్రగొండపాలెంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ పార్టీ ఎప్పుడు గెలవనట్లుగా తెదేపా పార్టీ మాత్రమే ఒంటరిగా గెలిచినట్లుగా వారు చేస్తున్నటువంటి ఆకృత్యాలు గొడవలు వివాదాలు సృష్టించడం సరైన విధానం కాదన్నారు. ప్రజల మద్దతును పొందిన ప్రభుత్వం ప్రజలను కాపాడే ప్రయత్నం చేయాలని పేర్కొన్నారు.

కావాలని ప్రజల మధ్య చిచ్చుపెట్టే కార్యక్రమాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చెయ్యడం మానుకోవాల్సిందిగా తెలిపారు. బొమ్మలను ధ్వంసం చేయడం నియమాలను, నిబంధనలను పాటించకుండా వారి యొక్క పేర్లను రాసుకోవడం ఎలాంటి జీవోలు లేకుండా వ్యక్తిగతంగా అధికారాన్ని వారి సొంత ఇంట్లో వస్తువుగా ఉపయోగించుకోవడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టుగా భావిస్తున్నానని అన్నారు. మేము కూడా ప్రభుత్వానికి సహకరిస్తామని యర్రగొండపాలెం అభివృద్ధికి మా వంతు కృషి చేస్తామని ఆయన తెలియజేశారు. ఈ సమావేశంలో యర్రగొండపాలెం సర్పంచి అరుణబాయి, వైసీపీ నాయకులు ఉడుముల శ్రీనివాస్ రెడ్డి, జబీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

పార్సిల్ మిరపకాయల లారీ బోల్తా

డ్రైవర్‌కు స్వల్ప గాయాలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : న్యూ విజయ జానకి పార్సిల్ లారీ అదుపుతప్పి బోల్తా పడడంతో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. కనిగిరి మండలం జమ్ములమడక గ్రామం నుండి 70 మిరపకాయల టిక్కీలు న్యూ విజయ జానకి పార్సిల్ లారీలో వేసుకొని బయలుదేరింది. కనిగిరి నుండి విజయవాడ వెళుతూ మార్గమధ్యంలో ముండ్లమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఉన్న బ్రిడ్జి గోడను ఢీ కొట్టి వేగంగా వెళ్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గోడను ఢీ కొట్టి లోపలకు దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సత్యనారాయణకు స్వల్ప గాయాలు అయ్యాయి. వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్స చేశారు. డ్రైవర్ మద్యం మత్తులో ఉండడంతో పార్సిల్ లారీ అధుపుతప్పి గోడను ఢీ కొట్టినట్లు స్థానికులు చెబుతున్నారు.

రాజ్యాంగ నిర్వీర్యాన్ని టీడీపీ, జనసేనలు అడ్డుకోవాలి

- సేవ్ కాన్స్టిట్యూషన్ - సేవ్ ఇండియా గద్దర్ ఆశయం
- గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుమ్మడి సూర్య కిరణ్

విశాలాంధ్ర-ఒంగోలు : రాజ్యాంగాన్ని మార్చాలనుకుంటున్న బిజెపి కార్యాచరణను తెలుగుదేశం, జనసేన పార్టీలు అడ్డు కోవాలని ప్రజా యుద్ధనౌక గద్దర్ కుమారుడు, గద్దర్ ఫౌండేషన్ వ్యవ స్థాపకులు గుమ్మడి సూర్య కిరణ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఒంగోలులోని ప్రెస్ క్లబ్‌లో దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో సూర్యకిరణ్ మాట్లాడారు. మోడీ ప్రధానిగా వచ్చాక రాజ్యాంగానికి, తద్వారా ఈ దేశ ప్రజలకు ప్రమాదం పొంచి ఉందని గుర్తించిన తన తండ్రి గద్దర్ సేవ్ కాన్స్టిట్యూషన్ - సేవ్ ఇండియా పేరుతో ప్రతి పల్లెకు తిరిగి ప్రజల్ని చైతన్యవంతుల్ని చేశారన్నారు. ప్రజాస్వామిక వాదులను, విద్యావంతులను, మేధావులను, ప్రజా సంఘాలను కలిసి రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు మద్దతు కూడగట్టారన్నారు. భారత రాజ్యాంగం బిజెపికి 400 సీట్లు వస్తే మార్చేది కాదని, స్వాతంత్ర పోరాటంలో అసువులు బాసిన లక్షలాదిమంది ప్రజల ప్రాణత్యాగాలకు ప్రతిరూపం అన్నారు. 2024 ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి ఒంటరిగా 400 ఎంపీ సీట్లు దక్కి ఉంటే, రాజ్యాంగాన్ని, మనిషిని మనిషిగా చూడని మనుధర్మ శాస్త్రానికి

మిగతా 2లో ...

సముద్ర ఉత్పత్తులకు కేంద్ర బిందువు

ఇసుకపల్లి సంత

- ఆదివారం ఒక్క రోజే రూ.లక్షల్లో విక్రయాలు
- రాష్ట్రంలో ప్రఖ్యాత చేపల సంతగా ఇసుకపల్లి

విశాలాంధ్ర - రేపల్లె : ఆంధ్రప్రదేశ్‌లోనే ప్రసిద్ధిగాంచిన సంతగా రేపల్లె పట్టణంలోని ఇసుకపల్లి చేపల సంత.మార్కెట్ యార్డ్ ఆవరణలో ఆదివారం ఒక్కరోజే తీర ప్రాంతంలోని సముద్ర ఉత్పత్తుల విక్రయాలకు కేంద్ర బిందువుగా ఇసుకపల్లి చేపల సంత పేరుగాంచింది. ప్రతి ఆదివారం రేపల్లె, ఇసుకపల్లి చేపల సంతలో తీర ప్రాంతంలోని నిజాంపట్నం హార్బర్, కొత్తపాలెం, అడవులదీవి, గుణ్ణం తిప్ప, లంకెవాని దిబ్బ, లక్ష్మీపురం, దిండి అధవల, తదితర గ్రామాల్లో మత్స్యకారులు వేటకు వెళ్లి పట్టుకొచ్చిన మత్స్య సంపద పండుగప్ప, మాగా, చుక్క చందువ, గురక, వంజరం, సో ర,తదితర చేపలు పెద్ద, చిన్న, సైజులో అన్ని రకాల చేపలు ఎండు, పచ్చి, రకాల చేపలు, రొయ్యలు, పీతలు, వీటితోపాటు అన్ని రకాల కూరగాయలు, ఉదయం నుండి మధ్యాహ్నం వరకు సంతలో విక్రయాలు జరుగుతూ ఉంటాయి. రేపల్లె పరిసర ప్రాంతాల నుండి కొనుగోలుదారులు ఈ సంతకు వచ్చి ఈ సంతలో కావలసిన సరుకులను కొనుగోలు చేసుకోవడంతో తీర ప్రాంతంలో సముద్ర ఉత్పత్తులు అమ్మకంతో లక్షలాది రూపాయలు విదేశీ మారక ద్రవ్యము లభిస్తుంది. ఈ సంతలో దొరకని వస్తువులు సరుకులు అనేవి లేవు అన్ని రకాల కూరగాయలు, సముద్ర ఉత్పత్తులు,ఈ సంతలో దొరుకుతాయి ఇదేవిధంగా లక్ష్మీ టాకీస్ సెంటర్లో మినీ సంతగా పచ్చి రొయ్యల, చేపలు, పీతలు, నత్తలు వంటివి ఈ కేంద్రాల ద్వారా ఆదివారం ఉదయం నుండి సాయంత్రం వరకు కొనుగోలు, అమ్మకం దారులతో లక్ష్మీ టాకీస్ సెంటర్ మినీ సంతగా కనిపిస్తూ ఉంటుంది. ఇక్కడ రొయ్యల, పీతల, చేపల కేంద్రాలు తీర ప్రాంతంలోని మత్స్యకారులు ఉత్పత్తి దారులు, అమ్మకం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో ఆదివారం ఒక్కరోజే లక్ష్మీ టాకీస్ సెంటర్ కొనుగోలుదారులతో కిటకిటలాడుతూ ఉంటుంది. ఇసుకపల్లి సంతగా పేరు పొందిన ఈ సంత ఆంధ్రప్రదేశ్‌లో చెప్పుకోదగ్గ సముద్ర ఉత్పత్తుల విక్రయ కేంద్ర సంతగా చెప్పుకోవచ్చు. వందలాదిమంది మత్స్యకారులు వారి కుటుంబాల వారు ఈ చేపల సంత పై ఆధారపడి జీవిస్తూ ఉన్నారు.తీర ప్రాంతంలోని సముద్ర ఉత్పత్తులకు కేంద్ర బిందువుగా రేపల్లె కేరాఫ్ ఇసుకపల్లి సంతగా దినదిన ప్రవర్ధ మానంగా అభివృద్ధి చెందుతూ ఉంది.ప్రభుత్వ ప్రోత్సాహం ఎక్కువగా ఉంటే ఈ సంత ఎంతో అభివృద్ధి చెందటానికి అవకాశాలు మెండుగా ఉన్నాయి. కావున సముద్ర ఉత్పత్తులకు కేరాఫ్ ఇసుకపల్లి సంతను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకుని మత్స్యకారులకు కావలసిన మౌలిక వసతులు కల్పిస్తే ఈ సంత మరింత అభివృద్ధి చెందడానికి అవకాశాలు అధికంగా ఉంటాయ నీ క్రయ విక్రయ దారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సచివాలయ కన్వీనర్ పొల్లా సుబ్రమణ్యం రాజీనామా

విశాలాంధ్ర-వెలిగండ్ల : మండలంలోని 2024 మేలో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో వైయస్సార్ పార్టీ పరాజయం చెందడంతో బాధ్యత వహిస్తూ మండల పదవి సచివాలయ కన్వీనర్‌కి రాజీనామా చేసి రాజీనామా లేఖ జిల్లా పార్టీ అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ శివ శంకర్ రెడ్డికి పంపినట్లు సచివాలయ కన్వీనర్, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు పొల్లా సుబ్రమణ్యం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలో పార్టీ పరాజయం పొందడానికి బాధ్యత వహిస్తూ ఆదివారం రాజీనామా చేశానని పార్టీ తనకు ఇచ్చిన గౌరవాన్ని శిరసా వహిస్తూ బాధ్యతగా ఎన్నికలలో మండలంలో మెజారిటీ కోల్పోయిన వైఎస్ఆర్ పార్టీకి తాను ఒక బాధ్యత వహిస్తూ ఈ రాజీనామాను చేసి జిల్లా నాయకత్వానికి పంపినట్లు ఆయన తెలిపారు.

ఎమ్మెల్యే ముత్తుములను సన్మానించిన వీఆర్ఓల సంఘం

విశాలాంధ్ర-గిద్దలూరు : నూతనంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన ముత్తుముల అశోక్‌రెడ్డిని ఆదివారం గిద్దలూరు మండలంలోని విఆర్ఓలు కలిసిన ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విఆర్వోల సంఘం అధ్యక్షులు వైపి రంగయ్య, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరామయ్య, నాగేంద్రుడు, ఈశ్వర్ రెడ్డి, అక్బర్ వలి, రమణ, అచ్చయ్య, శంకర్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపిన అపుస్మా నాయకులు

విశాలాంధ్ర-సంతనూతలపాడు : సంతనూతలపాడు ఎమ్మెల్యేగా అపూర్వ విజయం సాధించిన బీఎన్ విజయ్ కుమార్‌ను ఎస్ఎన్ పాడు నియోజకవర్గ ప్రైవేట్ స్కూల్స్ కరస్పాండెంట్లు ఆదివారం ఒంగోలులోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా మీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బీఎన్ వారికి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అపుస్మా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏవి సుబ్బారావు అపుస్మా జిల్లా జనరల్ సెక్రటరీ బొడ్డు హనుమంతరావు ఎస్ఎన్ పాడు నియోజక కార్యదర్శి గుంటూరు ప్రసాద్ గురుదత్త స్కూల్ సీతారామాంజనేయులు రుద్రవరం కోటేశ్వరరావు జగదీష్ సాయి తదితరులు ఉన్నారు.

పీఆర్ ఏఈని సన్మానించిన ఎంపీపీ

విశాలాంధ్ర-కొమరోలు : కొమరోలు పట్టణంలోని నరసింహ స్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన వేడుకలు పంచాయతీరాజ్ ఏఈగా పదవీ విరమణ చేసిన

నెలకుర్తి రమణయ్యను ఎంపీపీ కామూరి అమూల్య శ్రీనివాసులరెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు చేసిన సేవలు గురించి కొనియాడారు.

ఆదరించిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా

అపిసెట్టి ఉదయ్ శంకర్

విశాలాంధ్ర-గిద్దలూరు : భారత దేశ ప్రధాన మంత్రిగా ముచ్చటగా మూడో సారి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆదివారం సాయంత్రం మోడీ చిత్ర పటానికి బిజెపి గిద్దలూరు పట్టణ అధ్యక్షులు అపిసెట్టి ఉదయ్ శంకర్ ఆధ్వర్యంలో రాచర్ల గేట్ సెంటర్‌లో పాలాభిషేకం చేయడం జరిగింది. అనంతరం జరిగిన కార్యక్రమంలో ప్రధానమంత్రి మోడీ గురించి నాయకులు కొనియాడారు. జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు భవనాసి వెంకట రామాంజనేయులు,జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జె వి నారాయణ, జిల్లా నాయకులు డాక్టర్ ఆకుల నగేష్,జిల్లా కార్య వర్గ సభ్యులు ముపూరీ శ్రీనివాసులు, జిల్లా ప్రచార కమిటీ కన్వీనర్ ఆర్ కాసులు, అసెంబ్లీ కో కన్వీనర్ గుమ్మా రాముడు, జిల్లా మైనార్టీ అధ్యక్షులు షేక్ ఖాదర్ వలీ షఫీ, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి మట్టే మల్ల పుల్లయ్య, నియోజక వర్గ యస్.సి మోర్చ ఇంఛార్జి బందారి జయ ప్రసాద్, రూరల్ జనరల్ సెక్రెటరీ కోటి రెడ్డి, కొమరోలు మండల బిజెపి అధ్యక్షులు వెంకట రామిరెడ్డి,రూరల్ మండలం అధ్యక్షులు కె తిరుపాల్ రెడ్డి, పట్టణ బిజెవైయమ్ ఉపాధ్యక్షులు సంతోష్, పట్టణ బీజేపీ ట్రెజరర్ నూకల శ్రీనివాసులు, ఓబిసి కార్య వర్గ సభ్యులు వీర చక్రం,సీనియర్ నాయకులు బాదం జయ ప్రకాశ్, పట్టణ ఉపాధ్యక్షులు కొప్పరపు నాగేశ్వర రావు, సీనియర్ నాయకులు శివపురం రవి కుమార్, ఉపాధ్యక్షులు యమ్ వి రమణ, బీజేపీ నాయకులు రమేష్ పాల్గొనడం జరిగింది.

బీఎన్ విజయ్ కుమార్‌ను కలిసి సత్కరించిన బీజేపీ నాయకులు

విశాలాంధ్ర-సంతనూతలపాడు : సంతనూతలపాడు నియోజకవర్గ టిడిపి జనసేన బిజెపి కూటమి శాసనసభ్యులు బిఎన్ విజయ్ కుమార్ భారీ విజయం సాధించటం పట్ల బిజెపి ఆధ్వర్యంలో ఆదివారం బి ఎన్ విజయ్ కుమార్ ను తన కార్యాలయం నందు మర్యాద పూర్వకముగా కలిసి బొకే అందజేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో బిజెపి మండల అధ్యక్షులు దుంపా కోటిరెడ్డి ఎస్సీ సెల్ అధ్యక్షులు పాలేటి మురళి బిజెపి నాయకులు కూరపాటి సుబ్బారావు నూతలపాటి సుబ్బారావు కొణిజేటి శ్రీనివాసరావు ఎస్టీ సెల్ అధ్యక్షులు గాలేటి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఐ వెంకటేశ్వర్లుకు ఎస్ఐగా ప్రమోషన్

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : పోలీస్ స్టేషన్లో గత రెండు సంవత్సరాలుగా ఏఎస్ఐగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు ప్రమోషన్లు ఎస్సైగా బాపట్ల జిల్లాకు బదిలీ కావడంతో ఆదివారం నాడు నాగులుప్పలపాడు పోలీస్టేషన్లో స్థానిక ఎస్సై బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై బ్రహ్మనాయుడు మాట్లాడుతూ ఎస్ఐగా పదోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న వెంకటేశ్వర్లు కొనియాడారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సుబ్బారావు సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

విశాలాంధ్ర-చీమకుర్తి : 2024 లోక్ సభ ఎలక్షన్స్‌లో ఎన్డీఏ కూటమి అఖండ విజయం సాధించిన సందర్భంగా చీమకుర్తి జోహార్ హాస్పిటల్ నందు ఆదివారం రోగులకు బొద్దు శంకర్రావు పండ్లు పంపిణీ చేశారు. నరేంద్ర మోడీ మూడవసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయుచున్న సందర్భంగ పట్టణ అధ్యక్షులు బొద్దు శంకరరావు అధ్యక్షతన జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిల్డింగ్ వర్కర్స్ సెల్ రాష్ట్ర కమిటీ మెంబర్ గుండా శ్రీనివాసరావు, డాక్టర్ బి జవహర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గుండా శ్రీనివాసరావు మాట్లాడుతూ నరేంద్ర మోడీకి మూడవసారి కూడా ప్రజలు పట్టం కట్టడం ఎన్డీఏ కూటమి అత్యధిక స్థానాలు గెలుచుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటం దేశంలోని పౌరులందరూ బిజెపి పార్టీపై అత్యంత విశ్వసనీయత తో ఉన్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రూరల్ అధ్యక్షులు బొద్దుపాటి వెంకటేశ్వర్లు, పాత్రుని నాగార్జున, పొదిలి శ్రీనివాసరావు, కోరా నాగేశ్వరరావు, గోనుగుంట శివ, దివి శీను, బక్క బెనర్జీ, పాల్గొన్నారు.

చీరాల ఎమ్మెల్యే కొండయ్య యాదవ్‌ను కలిసిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర-కనిగిరి : ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందిన చీరాల తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే యంయం కొండయ్య యాదవ్ ను కనిగిరి తెలుగుదేశం పార్టీ నాయకులు ఆదివారం కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కనిగిరి పట్టణ తెలుగు యువత నాయకులు కొల్లూరి శ్రీనివాసరావు, కొట్టే ప్రసాదు, ముండ్లమూరి అజయ్, కోట సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్వీర్యాన్ని టీడీపీ, జనసేనలు అడ్డుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

జిరాక్స్ కాపీగా రూపొందించే వారన్నారు. అదృష్టవశాత్తు, ఆశించిన సీట్లు రాక, తెలుగుదేశం, జనసేన వంటి ప్రాంతీయ పార్టీల మద్దతుతో బిజెపి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. సెక్యులర్ పార్టీలని చెప్పుకుంటున్న టిడిపి జనసేన వంటి ప్రాంతీయ పార్టీలు రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడాలన్నారు. బిజెపి చర్యలకు అడ్డుగా నిలవాలన్నారు. దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ, బిజెపికి రాజ్యాంగాన్ని మార్చేందుకు అవసరమైన 400 సీట్ల సంపూర్ణ మెజారిటీ వచ్చి ఉంటే, ముస్లింలతో పాటు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఓటు హక్కును నిరాకరించే వారన్నారు. స్వాతంత్రానికి పూర్వం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు ఓటు హక్కు లేదన్నారు. అంబేద్కర్ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు ఓటు హక్కు కల్పించారన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ రిజర్వేషన్లను తొలగించేవారన్నారు. భారతదేశంలో మతపరమైన రిజర్వేషన్లకు అవకాశం లేదని చెప్పిన భారతీయ జనతా పార్టీకి మద్దతు ఇచ్చిన తెలుగుదేశం పార్టీకి ముస్లింలు ఓటు వేయటం ఆశ్చర్యంగా ఉందన్నారు. దళితులు, బహుజనులు, క్రైస్తవులు, ముస్లింల ఓట్లతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు పవన్ కళ్యాణ్, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ రాజ్యాంగంలో బలహీనుడికి బలవంతుడికి సమన్యాయం కల్పించా రన్నారు. మోడీ రాజ్యాంగంలో అగ్రకులాలకు, అగ్రవర్ణాలకే న్యాయం దక్కు తుందన్నారు. ఇతర ప్రాంతాలకు వలస పోతుందని, రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని నాగేంద్ర డిమాండ్ చేశారు. చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్కు ప్రత్యేక హోదా తీసుకురావాలని, ప్రత్యేక హోదా ద్వారానే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధ్యమని నాగేంద్ర అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు చప్పిడి వెంగళరావు, మాల మహానాడు అధ్యక్షులు దారా అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

డిస్ట్రిక్ ఎడ్యుకేషనల్ సెక్రెటరీగా ఎన్నికైన కర్నాటి శివారెడ్డి

విశాలాంధ్ర-ఒంగోలు : జాతీయస్థాయి యునైటెడ్ హ్యూమన్ రైట్స్ ఫెడరేషన్ వారు విద్యారంగంలో చేసిన విశిష్ట సేవలను గుర్తించి కర్నాటి శివారెడ్డి ని" ప్రకాశం జిల్లా డిస్ట్రిక్ ఎడ్యుకేషనల్ సెక్రెటరీగా" ఎన్ను కున్నారు. ఆయనకు అనేకమంది పట్టణ ప్రముఖులు, విద్యాశాఖ అధికారులు అభి నందనలు తెలిపారు. అపెక్స్ విద్యాసంస్థల్లో జరిగిన అభినందన సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన పాఠశాల కరెస్పాండెంట్ కే.శివకోటి రెడ్డి,డిస్ట్రిక్ ఎడ్యుకేషనల్ సెక్రెటరీగా ఎన్నికైన కే.శివారెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పట్టణ ప్రముఖులు పాల్గొని అభినందనలు తెలిపారు.

కరాటే గ్రేడింగ్ టెస్ట్

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : సిద్దార్థ కరాటే అసోసియేషన్ సెక్రెటరీ, బ్లాక్ బెల్ట్ సెవెన్త్ డాన్ చీఫ్ ఎక్సామినర్‌గా వ్యవహరించిన నల్లూరి మోహనరావు ఆధ్వర్యంలో హైదరీ క్లబ్‌లో కరాటే గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. గిద్దలూరు, కొత్తపట్నం, ఒంగోలు నుండి 70 మంది విద్యార్థులు ఈ టెస్ట్‌కు హాజరయ్యారు. హాజరైన విద్యార్థులకు బెల్ట్స్, ధ్రువపత్రాలు అతిథులు అందజేశారు. స్పోర్ట్స్ కరాటే దూ అసోసియేషన్ అధ్యక్షులు గుండవరపు రాఘవ,సిద్దార్థ కరాటే అసోసియేషన్ ఏపీ, తెలంగాణా అధ్యక్షులు మండవ మురళీకృష్ణ, ఉపాధ్యక్షులు మారెళ్ల సుబ్బారావు, మండవ సుబ్బారావు. హైదరాబాద్ స్కూల్ కరస్పాండెంట్ జగదీష్, సూర్య స్కూల్స్ అధినేత వెంకటరామిరెడ్డి, తదితరులు పాల్గొని చదువుతోపాటు ఆత్మ రక్షణకు మనోధైర్యానికి కరాటే ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా స్పోర్ట్స్ కరాటే దూ అసోసియేషన్ చైర్మన్ ముత్త ముల అశోక్ రెడ్డి గిద్దలూరు శాసనసభ్యుల ఎన్నికైన సందర్భంగా కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్స్ వెంకటేశ్వర్లు, అనీల్, సుబ్రహ్మణ్యం, రామకృష్ణ, యస్వంత్ పాల్గొన్నారు.

స్వీట్లు పంపిణీ

విశాలాంధ్ర-సీఎస్‌పురం : మండల కేంద్రమైన సీఎస్‌పురంలో ఎన్డీఏ కూటమి తరపున మూడవసారి ప్రధానమంత్రిగా నరేంద్రమోడీ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా సీఎస్‌పురం బస్టాండ్ సెంటర్‌లో బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు ఇండ్లా వెంకటసత్యం ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో రాష్ట్రంలో జనసేన, టీడీపీ, ఉమ్మడి కూటమి సంచలన విజయం సాధించిందని వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ నెల 12న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నాల్గవసారి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేస్తున్నట్లు వారు ఆనందం వ్యక్తం చేశారు. మండల టీడీపీ నాయకులు మన్నేపల్లి శ్రీనివాసులు, నాయుడు నారాయణ, ముప్పాళ్ల శ్రీనివాసులు (మిల్), గుడిపాటి రామారావు, తోట వెంకటేశ్వర్లు, తోకల మాల్యాద్రి, బోయిన మాలకొండయ్య, బోయిన మాల్యాద్రి, బి తిరుపతిరెడ్డి, తోట రమణయ్య, బీజేపీ నాయకులు రమణయ్య, మన్నేపల్లి మాల్యాద్రి, రెబ్బ రాయుడు, చౌడయ్య ఉన్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా

డ్రైవర్‌కు గాయాలు

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని అల్లినగరం పంచాయతీ తిమ్మారెడ్డి పల్లె గ్రామ సమీపంలో మలుపు వద్ద రాష్ట్ర రహదారిపై కొమరోలు నుండి పోరుమామిళ్ల వైపు వెళుతున్న లారీ బోల్తా పడడంతో డ్రైవర్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న గ్రామస్తులు 108కి ఫోన్ చేసి లారీ డ్రైవర్ను క్లీనర్ను ఆస్పత్రికి తరలించారు.

దుక్కులతో అనేక ప్రయోజనాలు

■ తెగుళ్లు దూరం ■ అధిక దిగుబడులకు అవకాశం

విశాలాంధ్ర-ముండ్లమూరు : వేసవి దుక్కులలో రైతులు బిజీ బిజీగా ఉన్నారు. ట్రాక్టర్లతో పొలాలను దున్నుతూ ఖరీఫ్ సాగుకు సమాయత్తమవు తున్నారు. వేసవి దుక్కుల వల్ల పంటలను పలు తెగుళ్ల బారి నుంచి కాపాడుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ ఫారుక్ తెలిపారు. మండలంలోని ఉమామహేశ్వరపురం, పూరి మెట్, భీమవరం, ఈదర, రమణారెడ్డి పాలెం, పులిపాడు, మారెళ్ళ, నాయుడుపాలెం, తమ్మలూరు, ముండ్లమూరు, సింగనపాలెం, పసుపుగల్లు, ఉల్లగల్లు, జమ్మలమడక, పోలవరం, నూజిల్లపల్లి, శంకరాపురం తదితర గ్రామాలలో గత సంవత్సరం 42 వేల ఎకరాలలో మొక్కజొన్న1000, మిరప4000, సజ్జ1500, కంది 4000, వరి5000, నువ్వులు1500, బ్యార్ పొగాకు2000, బర్లీ పొగాకు 3000, ఉప్పు సెనగ1000, మొత్తం 42 వేల ఎకరాలలో పంటలను సాగు చేశారు. పంటలు బాగా పండి అధిక దిగుబడులు రావడంతో రైతులు సంతోషించారు. ఈ సంవత్సరం ఎక్కువ మొత్తంలో పంటలు సాగు చేసేందుకు సమాయత్తమవు తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు తమ భూములను ట్రాక్టర్లతో లోతుగా మెత్తగా దునిస్తున్నారు. లోతైన దుక్కుల వల్ల నేలలోని పోషకాలు పైకి రావడంతో దిగుబడి పెరుగుతుందని అంటున్నారు.

చీడపీడల నివారణ :

పంటల్లో కాండం తొలుచు, ఆకు ముడత, కాండం కుళ్ళు తెగులకు కారకాలైన పురుగుల గుడ్లు నేల లోపలి పొరల్లో ఉండడంవల్ల తర్వాత వచ్చే పంటల్లో మళ్లీ తెగుళ్లు వ్యాప్తి చెంది పంటలను నాశనం చేస్తాయి. వేసవిలో లోతుగా భూములను దున్నడం వల్ల వివిధ తెగుళ్ళకు కారణమయ్యే పురుగుల గుడ్లు బయటకు వచ్చి ఎండ వేడిమికి అందులోని జీవం చనిపోవడం లేదా, పక్షులు తినేయడంతో పంటలపై తెగుళ్ల వ్యాప్తి తగ్గుతుంది. మొండి జాతికి చెందిన గడ్డి మొక్కలు, మొక్కల మూలాలు ఎండ దెబ్బకు ఎండిపోయి వాటి ఉధృతి బాగా తగ్గుతుంది. నేల సారవంతం అవుతుంది. దీనివల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారి తెలిపారు.

నేల సారవంతం -

ఏవో మహమ్మద్ ఫరూక్, ముండ్లమూరు

వేసవి దుక్కులవల్ల ఖరీఫ్ పంటలో తెగుళ్ల వ్యాప్తి నివారించవచ్చు. గత పంటలలో ఉన్న తెగుళ్ల బీజాలు నిర్మూలించడమే కాకుండా నేల సారవంతం అవుతుంది. మొండి కలుపుమొక్కలు నివారించ కోవచ్చు. దీనివల్ల చాలా వరకు ఖర్చులు తగ్గుతాయి. రైతులందరూ వేసవి దుక్కులు చేయడం వల్ల ఖరీఫ్ పంటలకు మేలు జరుగుతుంది, అధిక దిగుబడులు సాధించవచ్చు.

ఒంగోలులో బీజేపీ విజయోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ 3వ సారి ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భముగా బిజెపి ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ యోగ య్యయాదవ్ నాయకత్వములో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఒంగోలులో రత్న మహల్ సెంటర్‌లో బిజెపి నాయకులు కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున బాణా సంచా పేల్చి, మిఠాయిలు స్వీట్లు పంచిపెట్టారు. యోగ య్యయాదవ్ మాట్లాడుతూ భారత దేశం ముద్దు బిడ్డ. మన ప్రియతమ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ 3వ సారి ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్నారు. అంటే దేశములో ఉన్న 140 కోట్ల మంది ప్రజలు ఎంతో ఆనందముగా ఉన్నారని, వరుసగా జవహర్లాల్ నెహ్రూ తరువాత మూడవ సారి ప్రధాన మంత్రిగా నరేంద్ర మోడీ పదవీ బాధ్యతలు స్వీకరించటం దేశ వ్యాప్తంగా ప్రజలు ఆనందముగా సంబరాలు జరుపుకోవటం చూస్తుంటే ఆనందంగా ఉందన్నారు.

ఎమ్మెల్యే సారూ..రోడ్లపై దృష్టి సారించండి..

విశాలాంధ్ర-కూచిపూడి: మొవ్వ మండలంలో సామాన్యు లకు సైతం ప్రధాన ఇబ్బందిగా మారి ప్రమాదాలు జరుగుతున్న ప్రధాన రహ దారులపై దృష్టి సారించి సమస్యను పరిష్కరిం చే దిశగా అడుగులు వేయాలని ఈనెల నాలు గవ తారీఖున అత్యధిక మెజార్టీతో పామర్రు నియోజకవర్గంకు ఎన్డీఏ కూటమి తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందిన వర్ల కుమార్ రాజాను పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్లపై దృష్టి సారించకపోవడంతో పడిన గోతులు పెరిగి పెరిగి వాహనదారులనే కాకుండా పాద చారులను సైతం ప్రమాదాల పాలు చేస్తున్న సంగతిని బాధితులు ప్రస్తావిస్తున్నారు. ఇదే సమయంలో రోడ్లపై పడిన గోతులలో వర్షాకాలంలో నిలిచిన నీటిలో వరి నాట్లు వేసిన విషయాన్ని సైతం మర్చిపోకుండా రహదాంౕల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకు రావాలని మండల ప్రజలు కోరుతున్నారు. కూచిపూడి కేంద్ర బిందువుగా తీసుకొని మొవ్వ మీదుగా కొడాలి వెళ్లే రోడ్డు, పెదసనగల్లు, భట్లపెనుమర్రు వెళ్లే రహదారి, కూచిపూడి నుంచి బార్లపూడి, కూచిపూడి నుంచి పెదపూడి మీదుగా బందరు వెళ్లే రహదారి, పా మర్రు వెళ్లే రహదారి, కృష్ణాపురం వెళ్లే రహదారి, బార్ల పూడి నుంచి భట్లపెనుమర్రు రోడ్డు, మొవ్వ నుంచి పెదముత్తేవి మీదుగా కోసూరు, ఘంటసాల వెళ్లే రోడ్డు, కోసూరు నుంచి మల్లంపల్లి వెళ్లే రోడ్డు, కోసూరు నుంచి కాజ వెళ్లే రోడ్డు. బార్లపూడి నుంచి నర్సంపాలెం మీదుగా మొవ్వ వెళ్లే రోడ్డు, కారకంపాడు నుంచి అయ్యంకి వెళ్లే రోడ్డు, కారకంపాడు నుంచి పెదముత్తేవి వెళ్లేరోడ్డు... ఇలా ఆర్ అండ్ బి, జిల్లా పరిషత్ రహదారుల పరిస్థితి దుర్భరంగా ఉండి గోతులతో లేచిన కంకరరాళ్ళతో భయంకరంగా మారిన సంగతి విధితమే. ఈ రహదారు లపై ప్రయాణం చేస్తుంటే నరకప్రాయంగా మారిపోతుం దని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. ముఖ్యంగా వర్షం వచ్చిన సమయంలో అయితే గోతులలో పడిపోయే పరిస్థితి ఏర్పడుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితులను పరిగణలోనికి తీసుకొని ఈనెల 12న జరిగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం అనంతరం కొనసాగే అసెంబ్లీ సమావేశాలలో రహదారుల దుస్థితిని ప్రస్తావించి నిధులు మంజూరుకు కృషిచేసి సమస్యను తొలగించాలని కోరుతున్నారు. రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరుకు ఆలస్యం అయ్యే అవకాశాలు ఉన్నందున ఈలోగా మానవతా దృష్టితో సమస్యలను పరిగణలోనికి తీసుకొని కనీసం ప్రమాదకరంగా తయారైన గోతులను యుద్ధప్రాతిపదికన పూడ్చించి ఆదుకోవాలని వాహనదా రులు కుమార్ రాజాను కోరుతున్నారు.

భైరవకోనలో పూజలు

మాజీ చైర్మన్ వెంకటరామరాజు

విశాలాంధ్ర-సీఎస్‌పురం : జిల్లాలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన పర్యాటక కేంద్రమైన భైరవకోనలో భైరవకోన మాజీ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ గుంటిమడుగు వెంకటరామరాజు దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వారు జలపాతాన్ని సందర్శించిన అనంతరం కాళభైరవేశ్వరున్ని సంగమేశ్వరస్వామిని త్రిముఖ దుర్గాంబను, శివలింగాలను దర్శించుకొని పూజలు నిర్వహించారు. దేవస్థానం అర్చకులు స్వాగతం పలికి తీర్ధ ప్రసాదాలు అందజేసి శేష వస్త్రాలతో వెంకటరామరాజును అర్చకులు సత్కరించారు. మాజీ చైర్మన్ వెంకటరామరాజు ఆధ్వర్యంలో భారీ అన్న దానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు విక్రమరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఏపీ రైతు సంఘం జిల్లా సమావేశం

విశాలాంధ్ర-ఒంగోలు : ఈనెల 11వ తేదీ మంగళవారం ఉదయం 10గంటలకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సమావేశం మల్లయాలింగం భవన్ లో జరుగుతుందని జిల్లా ప్రధాన కార్యదర్శి కె వీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ హాజరగుచున్నారు. కావున రైతు సంఘం సభ్యులందరూ సకాలంలో హాజరుకవలసిందిగా కోరారు.

ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర - గుడివాడ : ఎస్టీయూ 78వ ఆవిర్భావ సందర్భాన్ని పురస్కరించుకొని ఆదివారం స్థానిక గౌరశంకరపురంలోని ఎస్‌టియు ప్రాంతీయ కార్యాలయంలో రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యుల ఆధ్వర్యంలో సంఘ పతాక ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.చంద్రశేఖర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వమే ఏర్పడిన ఏకైక సంఘం ఎస్టీయూ అన్నారు. సంఘం కోసం, ఉపాధ్యాయ హక్కుల పరిరక్షణకు కృషిచేసి ప్రాణాలర్పించిన ఎందరో మహనుభావులను స్మరించుకోవడం ముదావహమన్నారు. ఈ సందర్భంగా సీనియర్ కార్యకర్త, అంతర్జాతీయ ఖోఖో రిఫరీ మడకా ప్రసాద్‌తో 78వ ఆవిర్భావ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎం.వి.ఎస్.ఎన్ ప్రసాద్, జిల్లా నాయకులు పి.వి.ఎన్.డి ప్రసాద్, కెవి సత్యనారాయణ, ఎంఎస్ఆర్ పూజేశ్వరరావు, ఐ.అరవింద్, గుడివాడ, నందివాడ, గుడివాడ రూరల్, పెదపారుపూడి నాయకులు పాల్గొన్నారు.

స్వామి దీవెనలు గుడివాడ ప్రజలపై ఉండాలి

విశాలాంధ్ర - గుడివాడ : అభయాంజనేయ స్వామి కృప కటాక్షం గుడివాడ ప్రజలపై ఉండాలని మాజీ మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం నీలామహాలరోడ్డులోని అభయాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతి ముగిసిన సందర్భంగా బిఎస్ఎన్ఎల్ సుబ్రహ్మణ్యం వెంకటరమణ దంపతుల వితరణతో కమిటీ సభ్యులు సుంకర నాగర్జున, రత్నగిరి, పూజారి సందూరి రాంబాల ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారధన నిర్వహించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్లు నెరుసు చింతయ్య, గొకరకొండ బలరామ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఫాదర్ సురేష్‌కు ఘన సన్మానం

విశాలాంధ్ర-అవనిగడ్డ : కోటగిరిలంకలోని ఆర్.సి.ఎం చర్చ్ విచా రణ గురువు జి.సురేష్ మోర్ల గురు పట్టాభి మహోత్సవ కార్యక్రమా న్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఫాదర్ సురేష్ మోర్ల ఫాదర్ అయ్యి 20 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఆదివారం చర్చి ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన కేక్ కట్ చేశారు. అనంతరం ఫాదర్ లూయిస్ రాజు, ఫాదర్ జాన్ ఫాదర్ సురేష్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా లూయిస్ రాజ్ మాట్లాడుతూ ఫాదర్ సురేష్ 20 సంవత్సరాల్లో చేసిన ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను వివరించారు. ఫాదర్ జాన్ మాట్లాడుతూ గురువు గొప్పతనాన్ని వివరించగా ముందుగా 1918. 1931లో కోటగిరిలంక ఆర్.సి.ఎం చర్చిలో పనిచేసి ఇక్కడే మరణించిన యువ ఫాదర్ పి తిందోరియో, ఫాదర్ పి పాంధాన్, సిస్టర్ సి గోరట్ల మరియు కొవ్వల ధెరిస్సా, జి.సృజనమ్మ ఉన్నారు.

కంప్యూటర్ ప్రోగ్రామింగ్ స్కిల్స్ తప్పనిసరిగా నేర్చుకోవాలి

ఎక్సెల్ సొల్యూషన్ సీఈఓ డాక్టర్ రవికుమార్

విశాలాంధ్ర-ఒంగోలు : కంప్యూటర్ ప్రోగ్రామింగ్ స్కిల్స్ తప్పని సరిగా నేర్చుకోవాలని ఎక్సెల్ సొల్యూషన్ సిఇఓ డాక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. స్థానిక స్థానిక అంజయ్య రోడ్‌లోని బ్రిలియంట్ కంప్యూటర్ సంస్థ ప్రాంగణంలో త్వరలో ఇంజనీరింగ్ కళాశాలల్లో చేరబోతున్న విద్యార్థులకు నిర్వహించిన ఫ్రీ ఆస్క్ వర్క్ షాప్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ రాబోయే కాలంలో కంప్యూటర్ వినియం మరింతగా పెరుగుతుందని, అన్నీ రంగాల్లో కంప్యూటర్ సేవలు తప్పనిసరి అవుతాయని, కనుక విద్యార్థులు ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరిన మొదటి సంవత్సరం నుండే కొత్త కొత్త ప్రోగ్రామింగ్ సాఫ్ట్‌వేర్ లు నేర్చుకోవాలని, అప్పుడే క్యాంపస్ సెలెక్షన్స్ లో జాబ్ సాధించగలుగుతారని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న మరొక అతిథి ప్రముఖ సాఫ్ట్ వేర్ కంపెనీ లో సీనియర్ డేటా అనలిస్ట్ పనిచేస్తున్న బాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ప్రోగామింగ్ స్కిల్స్ బాగా నేర్చుకోవాలని, అవి కష్టం అనుకోకుండా ఇష్టంగా నేర్చుకోగల్గితే పెద్ద పెద్ద కంపెనీలలో మంచి ప్యాకేజి తో జాబ్స్ పొందవచ్చని, నేర్చుకునే సమయంలో ఏకాగ్రత కుదరకపోతే మెడిటేషన్ చేస్తే అన్ని సమస్యలు సులభంగా అధిగమించి సక్సెస్ అవ్వచ్చని ఉద్బోధించారు. కార్యక్రమంనకు అధ్యక్షత వహించిన బ్రిలియంట్ సంస్థ అధినేత డాక్టర్ న్యామత్ మాట్లాడుతూ బ్రిలియంట్ సంస్థ విద్యార్థుల శ్రేయస్సు కోసం ఇలాంటి ప్రోగ్రామ్స్ చేయడానికి ఎల్లవేళలా సంసిద్ధంగా ఉంటుందని, విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్ పర్సన్ డాక్టర్ తహూరా కోర్స్ కో ఆర్డినేటర్ కోటేశ్వరరావు, మోటివేషన్ ట్రైనర్ ప్రసాద్, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-ముండ్లమూరు : శంకర కంటి ఆసుపత్రి పెదకాని గుంటూరు వారి ఆధ్వర్యంలో ఉన్నం చారిటబుల్ ట్రస్ట్ విజయవాడ మరియు జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ముండ్లమూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో దృష్టిలోపం ఉన్నవారు పరీక్షలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా కంటి వైద్య నిపుణులు ఈ అరుణ్ చంద్ర, జి చేతన లక్ష్మిలు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శస్త్రచికిత్సలకు రిఫర్ చేశారు. మిగిలినవారికి అవసరాన్ని బట్టి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన కంటి వైద్య పరీక్షలు నిర్వహించడమే లక్ష్యంగా ఉన్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన ప్రచారం నిర్వహించి ఉచిత సేవలు అందించడం జరుగుతుందని అన్నారు. నూతన సాంకేతిక పద్ధతులతో ఈ శస్త్ర చికిత్సలకు సహాయ సహకారాలు అందిస్తున్న ఉన్నం చారిటబుల్ ప్రతినిధులైన ఉన్నం రామాంజనేయులు, ఉన్నం నరసింహారావు, ఉన్నం రాములకు హాజరైన వారు ధన్యవాదాలు తెలిపారు. క్యాంపు ఇన్చార్జి నాగబాబు వైద్య శిబిరానికి హాజరైన వారికి అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు ఉచిత భోజన వసతి కల్పించడం జరిగింది. 620 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా అందులో 364 మందికి శస్త్రచికిత్సల కొరకు రిఫర్ చేశారు.

క్యాంపెయిన్లపై ప్రభుత్వ జూనియర్ కళాశాల దృష్టి

విశాలాంధ్ర-కూచిపూడి: గ్రామాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు సైతం కార్పొరేట్ స్థాయి కాలేజీలతో పోటీలు పడి విద్యార్థుల కోసం క్యాంపన్లు నిర్వహిస్తున్నాయి. అయినా ఆ క్యాంపైన్లలో పలువురు స్పందన కొరవడిందని అధ్యాపకులు పేర్కొంటున్నారు. దీనిలో భాగంగానే రాష్ట్ర స్థాయిలో ఉత్తీర్ణతలో పలుసార్లు ప్రథమ స్థానాలు పొంది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ద్వారా ఉత్తమ అవార్డులు సాధించి గుర్తింపు పొంది, గత రెండు సంవత్సరాలుగా జిల్లా స్థాయిలో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతలో మొదటి స్థానంలో నిలిచిన మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల సైతం ఈ ఏడాది విద్యార్థుల కోసం క్యాంపైన్లు కొనసాగించారు. అయితే ఈ క్యాంపెయిన్ ఏమంత ఆశాజనకంగా లేదని అధ్యాపకులు ద్వారా వచ్చిన సమాచారం. వీరంతా పదవ తరగతి పరీక్ష ఫలితాలు వచ్చిన అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పదవ తరగతి విద్యార్థుల కోసం మండలాల్లోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ కళాశాలకు విద్యార్థినీ విద్యార్థులు విచ్చేసేమొవ్వ, గూడూరు, పమిడి ముక్కల, ఘంటసాల మండలాలోని గ్రామాల విద్యార్థుల వద్దకు వెళ్లారు. వారి తల్లిదండ్రులకు తమ కాలేజీలోని ఉత్తీర్ణతను, కళాశాలలో గల వసతులను, అధ్యాపకుల వివరాలను కోర్సుల వివరాలను వివరించారు. విద్యార్థుల్లో కొందరి దృష్టి ట్రిబుల్ ఐటీపై, మరి కొందరు పాలిటెక్నిక్ పై, కార్పొరేట్ కళాశాలపైమొగ్గు చూపుతున్నారన్నట్లు, కొందరు ఈ కళాశాలలో చేర్పించడానికి ఆసక్తి కనపరిచినట్లు తెలిసింది. ఇది ఇలా ఉండగా కళాశాలలో ఈనెల ఒకటి నుంచి ప్రారంభమైన అడ్మిషన్ ప్రక్రియల ద్వారా ఈ నెల 7వ తేదీ నాటికి (శని ఆదివారాలు సెలవులు) 90 మంది జాయిన్ అయినట్లు సమాచారం. దీనిలో ఎంపీసీ గ్రూపులో 28 మంది, బైపీసీలో 32, సీఈసీలో 21, హెచ్ఈసీలో ముగ్గురు విద్యార్థులు చేరారని, మిగిలిన 14 మంది వృత్తి విద్యా కోర్సులలో చేరినట్లు ప్రిన్సిపాల్ కేవీవీఎస్‌వీ ప్రసాదశాస్త్రి వివరించారు. ఈ విద్యార్థులకు సోమవారం నుంచి తరగతులు ప్రారంభించనున్నామని చెప్పారు.

మీడియా రంగానికి రామోజీ ఆదర్శం

విశాలాంధ్ర-అవనిగడ్డ : బహుముఖ ప్రజ్ఞశాలి, ఈనాడు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావ్ పత్రికా రంగానికే ఆదర్శం అని పలువురు పేర్కో న్నారు. ఆదివారం తెలుగు దేశం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రామోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళ్ళు అర్పించి మాట్లాడారు. తెలుగు నాట తొలిసారి 24 గంటల వార్త ప్రవంతికి శ్రీకారం చుట్టింది రామోజీరావ్ అని, పాత్రికేయులు, మిడియా రంగానికి ఆయన సేవలను కొనియాడుతూ పత్రికా రంగంలో నూతన వరవడిని సృష్టించారని, తెలుగు భాషాభివృద్ధికి, సిని రంగానికి రామోజీరావ్ చేసిన విశేష సేవలను కొనియాడారు. తెలుగు పాత్రికేయాన్ని వ్యవహారిక బాట పట్టించిన భాషా సంస్కర్త అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధానికి అమరావతి పేరు సూచించారని, చేసే పనిని ప్రేమించే రామోజీరావ్ నేటి యువతరానికి ఆదర్శం అని, రామోజీ ఫిల్మ్ సిటీ ద్వారా చలన చిత్ర రంగానికి ఒక చక్కని వేదికను ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు మెండు లక్ష్మణరావు, కర్రా సుధాకర్, బచ్చు రఘునాద్, విశ్వనాధపల్లి వెంకట స్వామి, గుంటూరు వినయ్, మండలి రాంమోహన్‌రావు, బచ్చు మురళి, సనకా బసవయ్య, పులిగడ్డ నాంచారయ్య, లింగం బాబూరావు, కంచర్ల ఆనంద్, నాగిడి రాంబాబు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్టీయూ78వ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర - కర్లపాలెం : ఎస్టీయూ కర్లపాలెం మండల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం 78వ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు.స్థానిక కర్లపాలెం మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద సీనియర్ ఉపాధ్యాయులు సొంగా ఏసుదాసు ఎస్టీయూ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ కర్లపాలెం మండల అధ్యక్షులు వై.గుదేరంకెయ్య, ప్రధాన కార్యదర్శి ఓ.శ్రీనివాసరావు,కోశాధికారి బి.సుబ్బారావు,బాపట్ల జిల్లా ఎస్టీయూ ఆర్థిక కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎన్.బి.సుభాని, సీనియర్ నాయకులు ఏ.సంగీతబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే,ఎంపీలకు శుభాకాంక్షలు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : సార్వత్రిక ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యే,ఎంపీలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు మాజీ సైనికుల తరపున జిల్లా అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు శుభాకాంక్షలు తెలిపారు.పట్టణంలోని విజయలక్ష్మీపురం మాజీ సైనిక సంక్షేమ సంఘం కార్యాలయంలో అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించి పోలీసు వారికి సహకరించిన మాజీ సైనికులను జిల్లా పోలీసు అధికారి వకుల్ జిందాల్ ప్రశంసించడం చాలా ఆనందంగా ఉందన్నారు.జిల్లా వ్యాప్తంగా ఎన్నికల సమయంలో విధులు నిర్వహించిన 65 మంది తాండ్ర సాంబశివరావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.బాపట్ల ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో విజయం సాధించిన వేగేసిన నరేంద్ర వర్మకి ప్రత్యేకమైన శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా రేణుకమ్మ అమ్మవారి వార్షికోత్సవం

విశాలాంధ్ర - యద్దనపూడి : మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలో జంపని కులదైవం రేణుకమ్మ అమ్మవారి 9 వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు.ఆలయ అర్చకులు నారాయణ శ్రీనివాసాచార్యులు,వెంకట సందీప్ దీక్ష ఆధ్వర్యంలో యోగ క్రతు నిర్వహనను నిర్వహించారు. గ్రామంలోని జంపని ఇంటి పేరు గల వంశస్థులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.గ్రామంలోని భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఆలయంలో విద్యుత్ దీపాలతో అలంకరించారు. కార్యక్రమంలో జంపని అంకమ్మ, జంపని శ్రీనివాస రావు,జంపని కుటుంబీకులు నిర్వహణ బాధ్యతలు చేపట్టారు.

గ్రామ ధార్మిక సమితులతో ధర్మ ప్రచారం

- ఇంటింటి ధర్మ ప్రచార కరపత్రాలు స్టిక్కర్లు ఆవిష్కరణ

విశాలాంధ్ర - రేపల్లె : సమరసత సేవా ఫౌండేషన్ ఈనెల 10 తేదీ నుండి 25వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా జరుగు ఇంటింటి ధర్మ ప్రచార కరపత్రాలు స్టిక్కర్లను తూములూరులో పెద్దలు సభ్యులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా తెనాలి ఖండ సంయోజక్ కడియాల సునీల్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ నుండి 25వ తేదీ వరకు నగరాలలో,మండలకేంద్రాలలో,గ్రామాలలో, ఇంటింటి ధర్మ ప్రచార నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ ధార్మిక సమితులు ప్రత్యేక శ్రద్ధ వహించి ఇంటింటికి వెళ్లి కరపత్రం ఇచ్చి స్టిక్కర్ అంటించి ప్రతి ఒక్కరూ హిందూ ధర్మంలోనే ఉండాలని మన ధర్మం యొక్క గొప్పతనాన్ని తెలుసుకోవాలని తెలియజెప్పడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 17వ తేదీలలో ఏకాదశి నగర సంకీర్తనలు చేయాలని22,23 తేదీ పౌర్ణమి సామూహిక హారతులు నిర్వహించాలన్నారు. హిందూ ధర్మ గొప్పతనం తెలియజేస్తూ కార్యకర్తలు హిందూ ధర్మ రక్షణ కోసం కృషి చేయాలన్నారు.

ఈ కార్యక్రమానికి జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, రెడ్డి వెంకటప్పరెడ్డి ,కటారి నారాయణ,నంది కంటి రామాంజనేయులు,నేత్ర నాగరాజు, రాపూరి పున్నయ్య, వెంకటేశ్వర్లు ,చల్లంచర్ల రమేష్,రాపూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా చింతల సుబ్బారావు

విశాలాంధ్ర - యద్దనపూడి : స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ నూతన రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక ఆదివారం ఉదయం పది గంటలకు తిరుపతిలోని టి.పి.ఎంహై స్కూల్లో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది.ఈ సమావేశంలో అధ్యక్షులుగా చింతల సుబ్బారావు,ప్రధాన కార్యదర్శిగా పి. నరోత్తమ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.నూతనంగా ఏర్పడిన ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. 117 జీవోను రద్దు చేయాలని, సి.పి.ఎస్‌ని రద్దు చేయాలని, ఇంగ్లీష్ పాటు తెలుగు మీడియం కూడా ప్రవేశపెట్టాలని కోరారు.గౌరవ అధ్యక్షులుగా ఎస్.శరత్ బాబు,వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జి.సౌరి రాయలు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మదన్మోహన్,మహిళా ప్రతినిధిగా బసవ సుజాత, ఉపాధ్యక్షులుగా సిహెచ్ శివశంకర్,కే.డేవిడ్ పాల్,శివ శంకరయ్య వేణుగోపాల్ రెడ్డి,కార్యదర్శులుగా బి.రాజశేఖర్, జి.శ్రీహరినాథ్,నాగరాజు రెడ్డి, నాగన్న,జి.గోవింద నాయుడు,జయానందం ఎన్నికయ్యారు. యద్దనపూడి ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు రావి శ్రీనివాసరావు, పలు ఉపాధ్యాయులు అభినందించారు.

నాదెండ్ల మనోహర్‌కి శివన్నారాయణ శుభాకాంక్షలు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : తెనాలి నియోజకవర్గం జనసేన పార్టీ కూటమి ఎమ్మెల్యేగా అఖండ మెజారిటీతో విజయం సాధించిన నాదెండ్ల మనోహర్‌ను బాపట్ల నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యేల మాలకొండయ్యకు జన నీరాజనం

విశాలాంధ్ర - చీరాల : నియోజకవర్గ ప్రజలు చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్యకు నీరాజనం పడుతున్నారు. నియోజకవర్గ నలుమూలల నుంచి ప్రజలు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నూతన శాసన సభ్యులను కలిసేందుకు తండోపతండాలుగా తరలివస్తున్నారంటే అతిశయోక్తి కాదు. చీరాల నియోజకవర్గంలో జరిగిన త్రిముఖపోటీలో దాదాపుగా గట్టి పోటీ వుంటుందని రాజకీయ విశ్లేషకులు భావించిన శాసనసభ ఎన్నికలలో తన వ్యూహ రచనలతో ప్రత్యర్థుల అంచనాలకు అందకుండా కొండయ్య దుసుకెళ్ళాడు.తన అభిమాన నాయకుడు కొండయ్యాను కలిసి కృతజ్ఞతలు తెలిపేందుకు టీడీపి,జనసేన బీజేపీ నాయకులు ప్రజలు తరలివస్తున్నారు.తనను కలిసేందుకు వస్తున్న నాయకులు కార్యకర్తలను ఉద్దేశించి శాసన సభ్యులు కొండయ్య మాట్లాడుతూ నియోజక వర్గ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వందశాతం నిలబెట్టుకుంటానని చీరాల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. చీరాలను టూరిస్ట్ హబ్‌గా చేసేందుకు తనవంతు కృషి చేస్తానని,చంద్రబాబు ఆశీస్సులతో అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలచి చీరాల ను అభివృద్ధి చేస్తానన్నారు.

వీర్ల అంకమ్మ తల్లికి ఎమ్మెల్యే వేగేశన ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - కర్లపాలెం : మండలంలోని పెదపులుగువారిపాలెం గ్రామంలో చినఅక్కలవారి ఇలవేల్పు శ్రీవీర్ల అంకమ్మ తల్లి మొదటి సంవత్సరం కొలుపులు కార్యక్రమంలో నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అందరు సంతోషంగా, ఐక్యంగా మెలగాలని అయన కోరారు.ఆయన వెంట తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : రైలు కిందపడి వ్యక్తి తీవ్ర గాయాలైన సంఘటన పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు కిందపడి తన కాళ్లు పూర్తిగా అయి ఉండటం గమనించిన స్థానికులు 108లో బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు.అక్కడ పరీక్షించిన వైద్యులు అతని పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు సిఫారసు చేశారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాపు,బలిజ సంక్షేమ సంఘం సంబరాలు

విశాలాంధ్ర-మంగళగిరి : సార్వత్రిక ఎన్నికలలో జనసేన 21 స్థానా లలో పోటీ చేసి 21, అలాగే రెండు ఎంపీ, స్థానాలలో గెలిచినందుకు మంగళగిరి కాపు బలిజ సంక్షేమ నియోజకవర్గ నాయకులు తిరుమల శెట్టి కొండలరావు గెలిచిన అభ్యర్థులకు అభినందనలు తెలిపారు. ఆదివారం మంగళగిరి కాపు బలిజ సంక్షేమ సంఘం కార్యాలయంలో కేక్ కటింగ్ చేసి, పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

బురకాయల అంకమ్మ తల్లి కొలుపులలో ఎమ్మెల్యే వేగేశన

విశాలాంధ్ర - కర్లపాలెం : మండలంలోని దిందువారిపాలెం గ్రామంలో పుట్టావారి ఇలవేల్పు బురకాయల అంకమ్మ తల్లి కొలుపులు కార్యక్రమంలో నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.పంటలు బాగా పండాలి అని, సుభిక్షంగా ఉండాలని ఆయన కోరారు.ఆయన వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోరాటాలకు..త్యాగాలకు నిలయం ఎస్టీయూ

విశాలాంధ్ర-గుంటూరు : పోరాటాలకు..త్యాగాలకు పుట్టినిల్లు ఎస్టీయూ (రాష్ట్రోపాధ్యాయ సంఘం) అని ఏఐఎస్‌టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి సీహెచ్.జోసఫ్ సుధీర్‌బాబు కొనియాడారు. గుంటూరులోని కంకం గుంటలో ఉన్న ఎస్టీయూ భవన్ నందు ఎస్టీయూ 78వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా జోసఫ్ సుధీర్‌బాబు జెండాను ఎగుర వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్రానికి పూర్వమే నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన సమరంలో బానిస సంకెళ్లను బద్దలుకొట్టి 17 మే 1946న ఆవిర్భవించి, జూన్ 9, 1947వ సంవత్సరం నుంచి అధికారిక గుర్తింపు పొందిన తొలి ఉపాధ్యాయ సంఘం రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూఏపీ) అని అన్నారు. 1963 నుంచి ఏపీ సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్లో వ్యవస్థాపక శాశ్వత సభ్య సంఘం ఎస్టీయూ అని, గత 77 సంవత్సరాలుగా నిరంత రం ఉద్యమ స్ఫూర్తితో ప్రగతి పథంలో పయని స్తుందన్నారు. ఉపాధ్యాయుల పలు సమస్యల పరిష్కారంలోను.. ఉపాధ్యాయులకు వివిధ సౌకర్యాలు కల్పించడంలోనూ ప్రభుత్వంతో పోరాడి సాధించటంలో విశేష కృషి చేసిన సంఘం అని పేర్కొన్నారు. అలాగే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో నిరంతరం శ్రమిస్తూ ముందుంటుం న్నారు. సంఘం ఉద్యమ నేతలు దివంగత మగ్దుం మొహిద్దిన్, పీవీ రాఘవాచారి, వీణా విజయరామ రాజు, పి.శ్రీరామ మూర్తి తదితరుల త్యాగం మరువలేనిదని ప్రశంసించారు. క్రమ శిక్షణ కలిగిన కార్యకర్తలుగా పని చేస్తూ సంఘ పురోభివృద్ధికి పాటుబడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డి. పెదబాబు, జిల్లా ప్రధాన కార్య దర్శి డీకే సుబ్బారెడ్డి, రాష్ట్ర ఉపాధ్య క్షులు వి.ప్రసా దరావు, రాష్ట్ర కౌన్సిలర్స్ షేక్ బాజీ, డీఏ జోసఫ్, ఆర్థిక కార్యదర్శి ఎల్. వీరాంజ నేయులు, జిల్లా సీనియర్ నాయకులు పి. శ్రీనివాసరావు, పి.ప్రసా ద్, రాజేష్, సుందరం, ఎంపీ సుబ్బారావు, దేవిద రాజు, ఎం. శ్రీనివా సరావు, కృష్ణ కిషోర్, జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ

విశాలాంధ్ర-మంగళగిరి : శ్రీలక్ష్మీ నరసింహ స్వామివారిని దర్శించుకున్న పొన్నూరు ఎమ్మె ల్యే ధూళిపాళ్ల నరేంద్ర ఆది వారం మంగళగిరి శ్రీ లక్ష్మీనర సింహస్వామి వారిని దర్శించు కుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవ స్థానం ఈఓ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి ధూళిపాళ్ల నరేంద్రకు ఘన స్వాగతం పలికారు. టీడీపీ సీనియర్ నాయకులు సంకా బాలాజీ గుప్తా ఉన్నారు.

జనసేన మహిళలు, నాయకులు పాదయాత్ర

విశాలాంధ్ర-మంగళగిరి : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిఠాపురంలో భారీ మెజారిటీతో విజయం సాధించిన సందర్భంగా ఆదివారం మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వీర మహి ళలు, జనసేన నాయకులు ఆదివారం పాదయాత్ర చేపట్టారు. పిఠా పురంలో పవన్ కళ్యాణ్ విజయం సాధించడంతో జనసేన కేంద్ర కార్యా లయం నుంచి విజయవాడ ఇంద్ర కీలాద్రి అమ్మవారి దేవస్థానం వరకు పాదయాత్రగా వెళ్లి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోను న్నారు. ముందుగా జనసేన కేంద్ర కార్యాలయం నుంచి జనసేన నేత చిల్లపల్లి శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు.

పెసరలంక వసంత దుర్గకి 'నాట్యేశ్వర' బిరుదు

విశాలాంధ్ర-తెనాలి : తెనాలి ఐతానగర్ శ్రీ లక్ష్మీ నారాయణ కూచిపూడి నృత్య కళానికేతన్ పెసర్లంక వసంత దుర్గ శిష్య బృందం చే ఆదివారం అమరా వతి శ్రీ అమరేశ్వర స్వామి వారి దేవస్థానం ప్రాంగణం నందు నృత్య మహోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాధా మాధవ పాల్గొన్నారు. రసరంజని వ్యవస్థాపక కార్యదర్శి షేక్ ఖలీల్ ఆధ్వర్యంలో గురువు పెసరలంక వసంత దుర్గకి 'నాట్యేశ్వర' బిరుదుతో సత్కరించి, శిష్యులైన భువన తేజ, తేజస్విని, అందేతన్మయి, నిత్యని హేరా, దీపిక, చైత్ర, కృతిక, ధన్విత, రోషిత, సాత్వికలను నాట్యాంబ బిరుదులతో సత్కరించి, ప్రశంసా పత్రములను అందించారు. బాల చంద్రమౌళి, రాజేశ్వరి, అనిత, లక్ష్మి పాల్గొన్నారు.

బీజేపీ జెండా ఆవిష్కరణ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : నరేంద్ర మోదీ మూడవసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయిస్తున్న సందర్భంగా గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని 5వ మండలం అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీజేపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి తూర్పు నియోజక వర్గ బీజేపీ కన్వీనర్ డాక్టర్ ఉమా శంకర్, కో-కన్వీనర్ షేక్.రఫీలు ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమా శంకర్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి రావటం చంద్రబాబు లాంటి విజన్ ఉన్న నాయకుడు ముఖ్యమంత్రి కావడం చాలా గర్వించదగ్గ విషయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎన్వీ సురేష్, సురేష్, వెంకట పృయ్య, వెంకటేశ్వర్లరావు, సాంబశివరావు, చంద్రశేఖర్, వెంకయ్య, లక్ష్మీనారాయణ, వికాస్, నాగేశ్వ రరావు, శంకర్, ఆంజనేయులు, బాలయ్య, గాయత్రి పాల్గొన్నారు.

సమర్ధన దివ్యాంగుల సంస్థ సహకారం అభినందనీయం

- బహుమతి ప్రధానోత్సవంలో ఎమ్మెల్యే గల్లా మాధవి

విశాలాంధ్ర-గుంటూరు : చెస్ అసోసియేషన్ ఫర్ విజువల్లీ ఛాలెంజ్డ్ ఆంధ్రప్రదేశ్ ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ ఫర్ ది బ్లైండ్ వారి ఆధ్వర్యంలో గుంటూరు సమర్ధన దివ్యాంగుల సమస్త వారి సహకారంతో గుంటూరు హిందూ ఫార్మసీ కాలేజ్ నందు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర స్థాయి జట్టు ఎంపిక పోటీలు నిర్వ హించారు. ఆదివారం జరిగిన బహుమతి ప్రధానోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గల్లా మాధవి, రామసేతు పెయింట్స్ అండ్ హార్డ్ వేర్ అధినేత పి సుధాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెక్రెటరీ సిహెచ్ కుమార్ రాజా మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న ఎంపిక పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుండి 21 మంది క్రీడాకారులను తెలంగాణ నుండి పది మంది క్రీడాకారులను ఎంపిక చేసి త్వరలో ఆగస్టులో జరగనున్న సౌత్ జోన్ టోర్నమెంటుకు పంపించడం జరుగుతుందన్నారు. టోర్నమెంట్ జరగటానికి సహకారాన్ని అందించిన హిందూ ఫార్మసీ కాలేజ్, సమర్ధనా దివ్యాంగుల సంస్థ డాక్టర్ పరమహంసకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. దివ్యాంగులకు సంబంధించి అన్ని రకాలుగా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తూ ప్రత్యేకంగా ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి దివ్యాంగుల పక్షాన నిలబడిన సమర్ధన దివ్యాంగుల సంస్థ సహకారం మరువలేనిదని అన్నారు. ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ జీవితంలో అన్ని సక్రమంగా ఉండి క్రమశిక్షణ లేకుండా జీవించే వారి కన్నా దేవుడు తమ జీవితంలో కొంత లోపాన్ని పెట్టినా కూడా క్రమశిక్షణతో పాటు తాము పూర్తిస్థాయి విజయాన్ని సాధించాలన్న విశ్వాసంతో చెస్ ఆడుతున్న వారిని చూడటం చాలా ఆశ్చర్యం కలిగించిందన్నారు. ముఖ్యంగా ఇటువంటి వారు జీవితంలో అత్యంత తెలివి కలిగి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అదేవిధంగా సమర్ధన దివ్యాంగుల సంస్థ ద్వారా దివ్యాంగులకు సహాయ సహకారాలు అందిస్తూ వారి యొక్క ఎదుగుదలకు తోడ్పాటు అందించడమే కాకుండా వారికి ఉద్యోగ అవకాశాలు కల్పన కూడా కృషి చేస్తున్న సమర్ధన దివ్యాంగుల సంస్థ సేవలను గల్లా మాధవి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సమర్ధన దివ్యాంగుల సంస్థ చైర్మన్ డాక్టర్ పరమహంస, రామసేతు పెయింట్స్ అధినేత పి సుధాకర్, చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకట్ రెడ్డి, ట్రెజరర్ ఎం. ప్రసన్నకుమార్, ఆర్బిటర్గా గోపీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావు మృతి సినీ రంగానికి తీరని లోటు

- సేవా సదన్‌లో నివాళులర్పించిన పలువురు ప్రముఖులు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : పద్మ విభూషణ్, ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత స్వర్గీయ చెరు కూరి రామోజీరావు లేని లోటు మీడియా రంగానికి..సినీ రంగా నికి తీరని లోటు అని పలువురు ప్రముఖులు కొనియాడారు. సేవా సదన్ సామాజిక సేవా సంస్థ, భారతీ సాంస్కృతి సంగీత కళావేదిక, గుంటూరు పార్లమెంటరీ కాపునాడు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అమరావతి రోడ్డులో ఉన్న సేవా సదన కార్యాలయంలో స్వర్గీయ చెరుకూరి రామోజీరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు రామోజీరావు చేసిన గొప్ప సేవలను గుర్తు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ఒక సామాన్య కుటుంబంలో జన్మించి ఉన్నత శిఖరాలకు ఎదిగిన వ్యక్తి చెరుకూరి రామోజీరావు అని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో సేవా సదన్ వ్యవస్థాపక అధ్యక్షులు మిరియాల గోపి కుమార్, చిరంజీవి యువత కార్యనిర్వాహక అధ్యక్షులు మేకల రవీంద్రబాబు, అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనే యులు, కళాకారులు, గాయకులు మిరియాల ప్రసాదరావు, కాపూరి సత్యనారా యణ, పెళ్లూరి కృష్ణారావు, కె.బాబురావు, పోతురాజు, సురేష్, వీర బ్రహ్మాచారి, పల్లంపాటి లలిత్ బాబు, తులసి అరుణ్ కుమార్ తదితర ఉన్నారు.

శిలాఫలకాలు ధ్వంసం చేస్తే తీవ్ర పరిణామాలు

విశాలాంధ్ర-గుంటూరు : ఎవరైనా అన్న ఎన్టీఆర్‌ను టచ్ చేయాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కో వల్సి ఉంటుందని ఆంధ్ర ప్రదేశ్ బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ హెచ్చరించారు. నగరం నడిబొడ్డున అన్న నందమూరి తారక రామా రావు పేరుతో ఎన్టీఆర్ స్టేడి యంగా ఏర్పాటై ప్రతి రోజూ ఎంతో మందికి నడక, వ్యాయామంతో ఆరోగ్యాన్ని ప్రసాదిస్తూ నగర వా సుల దినచర్యలో భాగమైన ఎన్టీ ఆర్ స్టేడియం పేరు మార్చాలని వైసీపీ సైకోలు చేసిన కుట్రలను ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ చైతన్య వేదిక న్యాయ పోరాటం ద్వారా సమర్ధవంతంగా తిప్పికొట్టడం జరి గింది. దీనిలో భాగంగా ఆంధ్ర ప్రదేశ్ బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో ఆదివారం ఉద యం ఎన్టీఆర్ స్టేడియంలో ఉన్న వాకింగ్ ట్రాక్ సభ్యులు, ఎన్టీఆర్ అభిమానులు మధ్య దొడ్డిదారిన నిబంధనలకు విరుద్ధంగా గుట్టుగా వైసీపీ మూకలు ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ధ్వంసం చేయడం జరిగింది. శిలాఫలకాల తొల గింపు కార్యక్రమంలో స్థానిక వా కింగ్ సభ్యులు, ఎన్టీఆర్ అభిమా నులు పాల్గొన్నారు. తెలుగు యువ త జిల్లా అధ్యక్షుడు రావిపాటి సాయికృష్ణ మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్‌రెడ్డి దురహంకారానికి ఇది నిదర్శనం ఆయ నకు ప్రజలు ఎన్నుకున్నది కట్టడాలు కూల్చే యడానికి పేర్లు మార్చ డానికేనా అని సాయి ప్రశ్నించారు. రాష్ట్ర అర్చక సేవా సంఘం ప్రధాన కార్య దర్శి జంధ్యాల రామలింగేశ్వర శాస్త్రి, మాజీ తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కొమ్మినేని సాంబశివ రావు, సవరం రోహిత్, నంది వెలుగు చందు, తెలుగు యువత నరేష్ గుత్తికొండ శ్రీనివాస్, స్టీఆర్ వాకింగ్ ట్రాక్ సభ్యులు ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుల సంఘ కార్యవర్గం ఏకగ్రీవం

విశాలాంధ్ర- తెనాలి : పట్టణ రంగస్థల కళాకారుల సంఘం సర్వసభ్య సమావేశం స్థానిక బుర్రిపాలెంరోడ్డు బీసీ కాలనీలోని సంఘ భవనంలో ఆదివారం ఉదయం సంఘ మాజీ ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. గత కార్యవర్గం పదవీకాలం అయిదు సంవత్సరాలు ముగియడంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటున్నట్లు సంఘంలోని మాజీ కార్యవర్గ సభ్యులు కొందరు ప్రకటించారు. ఎన్నికలు జరపడం వల్ల డబ్బు చాలా ఖర్చు జరుగుతుం దని, ఏకగ్రీవంగా ఎన్నికోవడం వల్ల ఆ ధనాన్ని కళాకారుల సంక్షేమానికి ఉపయోగించవచ్చని ముఖ్య అతిథిగా పాల్గొన్న సినీ మాటల రచయిత డాక్టర్ సాయి మాధవ్ బుర్రా సూచించారు. ఎన్నికల అధికారిగా కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ డి. ఎల్. కాంతారావు వ్యవహరించారు. నూతన కార్యవర్గాన్ని అప్పటికప్పుడే ప్రకటించి ప్రమాణ స్వీకారం చేశారు.

నూతన కార్యవర్గం వివరాలు: నూతనంగా ఎంపికైన కార్యవర్గం శ్రీమతి బుజ్జా జయలక్ష్మి (అధ్యక్షులు), ఆరాధ్యుల కోటేశ్వరరావు (గౌరవ అధ్యక్షుడు), గరికపాటి సుబ్బారావు (కార్యనిర్వాహక అధ్యక్షుడు), ఆరాధ్యుల ఆదినారాయణరావు (ప్రధాన కార్యదర్శి), ఎం. రామలింగేశ్వరరావు (కార్యనిర్వాహక కార్యదర్శి), దీపాల సుబ్రహ్మణ్యం (కోశాధికారి), ఉపాధ్యక్షులుగా శ్రీమతి బెజ్జంకి నాగమణి, శ్రీమతి నిర్మాలా రమేష్, పండిటి సుబ్బారావు, శరత్ వెంకయ్య, ముత్యాల లక్ష్మీ తులసి, సంయుక్త కార్యదర్శులుగా కనపర్తి మధుకర్, గోగినేని సుధీర్, మహబూబ్ సుభాని ఎంపిక కాగా కార్యవర్గ సభ్యులుగా బడుగు మోహనరావు, గోళ్ళ సుబ్రహ్మణ్యం, కొండముది రమేష్, ఎస్.కె. సైదా, శ్రీమతి వేములవాడ సత్యవతి ఎంపికయ్యారు. క్రమశిక్షణ కమిటీ సభ్యులుగా డాక్టర్ సాయిమాధవ్ బుర్రా, చెరుకుమల్లి సింగారావు, షేక్ జానిబాషా, న్యాయ సలహాదారుగా హరిదాసు గౌరీశంకర్, గౌరవ సలహాదారుగా ఉప్పాల రాజేశ్వరరావు, బనాల మల్లేశ్వరరావు, టి.వి.ఎస్. శాస్త్రి, కనపర్తి బాబురావు, గోగినేని కేశవరావు, బొల్లిముంత కృష్ణ, చిట్టూరి సీతారామయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సాయి మాధవ్ బుర్రా మాట్లాడుతూ పట్టణ రంగస్థల సంఘ కళాకారుల సంక్షేమం, అభివృద్ధి కోసం సాయశక్తులా కష్టపడి పనిచేస్తానని ప్రమాణం చేశారు. నన్నపనేని రాంబాబు, వినయ్ పాల్గొన్నారు.

నేడు క్యాన్సర్‌కు అధునాతన చికిత్సా విధానాలు

- అంకాలజిస్ట్ డాక్టర్ సత్య శ్రీనివాస్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రస్తుతం సమాజంలో క్యాన్సర్ వ్యాధి విస్తృతంగా వ్యాపించిందని, దీనికి జన్యుపరమైన కారణాలు..మనం అనుసరిస్తున్న జీవన శైలి..కొంత మందిలో ఏ విధమైన చెడు అలవాట్లు లేకపోయినప్పటికీ వారికి జన్యుపరంగా క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉంటాయని, అయితే ఈ క్యాన్సర్‌కు నేడు అధునాతనమైన చికిత్సా విధానాలు అందుబాటులోకి వచ్చినట్లు ప్రముఖ అంకాలజిస్ట్ ఎ.సత్య శ్రీనివాస్ అన్నారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం ఉదయం క్యాన్సర్‌కు గల కారణాలు..అందుబాటులో ఉన్న చికిత్సా విధానాలు గురించి డాక్టర్ సత్య శ్రీనివాస్ తెలియజేశారు. అనంతరం డాక్టర్ సత్య శ్రీనివాస్ మాట్లాడుతూ చాలామందిలో ధూమపానం, మద్యపానం, ప్యాసివ్ స్మోకింగ్, వివిధ రకాల రసాయనాలతో పండించిన కూరగాయలను, పండ్లను వినియోగించటం, వివిధ ఆహార పదార్థాలలో రుచుల కొరకు ఉపయోగించే అజినా మోటా లాంటి పదార్థాలు..వివిధ ఆహార పదార్థాలు

ఆకర్షణీయంగా కనపడటానికి ఉపయోగించే కలర్స్..కెమికల్స్ కలిపి తయారు చేసిన ఆహార ఉత్పత్తులను తినడం ద్వారా నేడు ఎక్కువ సంఖ్యలో క్యాన్సర్ బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తించిన ఎడల 100శాతం నయం చేయడానికి చికిత్సలు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. అలా కాకుండా అడ్వాన్స్ దశలో గుర్తించిన ఎడల ఈ క్యాన్సర్‌ను నయం చేయటం కష్టతరమవుతుందన్నారు. అడ్వాన్స్ దశలో క్యాన్సర్‌ను గుర్తించిన వారికి..వారి లైఫ్‌స్పాన్ పొడిగించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మనకు రెండు భాగాలకు సంబంధించిన క్యాన్సర్లకు వ్యాక్సిన్స్ అందుబాటులో ఉన్నాయని, అవి ఒకటి రంగుకు సంబంధించిన హెపటైటిస్ బి.వ్యాక్సిన్, రెండవది సర్వైకల్ క్యాన్సర్‌కు సంబంధించిన వ్యాక్సిన్ అని అన్నారు. ఈ రెండు రకాలకు తప్ప మన శరీరంలో వివిధ భాగాలకు సంభవించే క్యాన్సర్లకు వ్యాక్సిన్ లేదన్నారు. స్క్రీనింగ్ టెస్ట్‌ల ద్వారా కొన్ని సందర్భాల్లో క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తించవచ్చని, ఈ స్క్రీనింగ్ టెస్ట్‌లలో 100శాతం తెలిసే అవకాశం ఉంటుందని చెప్పారు. జనరల్ చెకప్‌లలో ఏదైనా క్యాన్సర్‌కు సంబంధించిన లక్షణాలు కనపడిన తదుపరి పెట్ స్కాన్, బయాప్సీ లాంటి పరీక్షల ద్వారా క్యాన్సర్‌ను నిర్ధారించి తగు వైద్యం చేసే అవకాశం ఉంటుందన్నారు. ఒకసారి క్యాన్సర్‌ను నిర్ధారించిన తర్వాత దాని స్థితి, అది ఏ కోవకు చెందిన క్యాన్సరో పరిశీలించి..ఏ రకమైన వైద్యం చేయాలన్నది వైద్యులు నిర్ణయిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి కో-ఆర్డినేటర్‌గా టీవీ సాయిరాం వ్యవహరించగా, అవగాహన సీనియర్ సభ్యులు కె.చంద్రశేఖరరావు, ఎ.రవీంద్ర కుమార్, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రివర్గంలో డాక్టర్ 'పెమ్మసాని'

- హర్షం వ్యక్తం చేస్తున్న ఉమ్మడి గుంటూరు జిల్లా వాసులు

విశాలాంధ్ర-నరసరావుపేట : ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా గుంటూరు పార్లమెంటు నియోజకవర్గం నుండి మొదటిసారి పోటీ చేసి గెలుపొందిన డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు కేంద్ర మంత్రివర్గంలో స్థానం లభించడంతో ఉమ్మడి గుంటూరు జిల్లా వాసులు హర్షంవ్యక్తం చేస్తున్నారు. తెనాలి మండలం బుర్రిపాలెం గ్రామానికి చెందిన పెమ్మసాని చంద్రశేఖర్ బాల్యం, విద్యాభ్యాసం నరసరావుపేటలో జరిగింది. పెమ్మసాని తండ్రి సాంబయ్య పట్టణంలోని స్టేషన్ రోడ్‌లో మాధురి హోటల్‌ను నిర్వహించేవారు. డాక్టర్ పెమసాని నరసరావుపేటలో మున్సిపల్ హైస్కూల్లో చదువుకుంటూ స్కూలు సెలవు దినాల్లో హోటల్లో తండ్రికి సహాయం చేస్తూ ఉండేవారు. పట్టణంలో మాధురి హోటల్ అంటే తెలియని వారు ఉండరు. చంద్రశేఖర్ మెడిసిన్ చదివి విదేశాలకు వెళ్ళిన అనంతరం మాధురి హోటల్‌ను మూసివేసి ఆ కుటుంబం తెనాలికి వెళ్లిపోయింది. పెమ్మసాని డాక్టర్‌గా విదేశాల్లో పేరు ప్రఖ్యాతులు గాంచి, మెడిసిన్ చదివే విద్యార్థులకు, ఆసుపత్రులకు సంబంధించిన మెటీరియల్ రూపొందించి ఆన్లైన్ ద్వారా సరఫరా చేయటంలో విశ్వ వ్యాప్తమయ్యారు. గత 2019 సార్వత్రిక ఎన్నికల్లో డాక్టర్ పెమసాని నరసరావుపేట నుండి పార్లమెంటుకు పోటీ చేసేందుకు ప్రయత్నించారు. నాయకులు రాయపాటి పోటీ చేస్తున్నటుతో టీడీపీ అధిష్టానం చంద్రశేఖర్‌కు అవకాశం ఇవ్వలేకపోయింది. ప్రస్తుత ఎన్నికల్లో సైతం ఆయన నరసరావుపేట నుండి పోటీ చేసేందుకు ప్రయత్నించారని సమాచారం. సిట్టింగ్ ఎంపీగా ఉన్న శ్రీకృష్ణదేవరాయలు వైసీపీకి రాజీనామా చేసి టిడిపిలో చేరి నరసరావుపేట నుండి పోటీ చేసేందుకు ఆసక్తి చూపటంతో టిడిపి అధిష్టానం పెమసానికి గుంటూరు సిటీ కేటాయించింది. రాజధాని జిల్లాలో ఉన్న గుంటూరు జిల్లా అభివృద్ధి మంత్రంతో నామినేషన్ వేసి ఎన్నికల ప్రచారానికి బయలుదేరిన డాక్టర్ పెమసాని సమీప ప్రత్యర్థిపై మూడున్నర లక్షల మేర మెజార్టీతో విజయం సాధించారు. మొదటిసారి పోటీ చేసి ప్రజల మన్ననలను పొందిన పెమ్మసాని చంద్రశేఖర్‌కు కూటమి తరపున కేంద్ర మంత్రి పదవి దక్కటంతో అటు పల్నాడు, ఇటు గుంటూరు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వెంకటేశ్వరస్వామి ఆశీస్సులు కూటమికి మెండుగా ఉండాలి

- జనసేన అధికార ప్రతినిధి ఆళ్ల హరి

విశాలాంధ్ర-గుంటూరు : ప్రజల ఆశీస్సులతో చారిత్రాత్మక విజయాన్ని అందుకొని పరిపాలనా పగ్గాలు చేపడు తున్న కూటమి నేతలకు వెంకటేశ్వరస్వామి ఆశీస్సులు మెండుగా ఉండాలని జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. రాష్ట్రంలో ఐదేళ్లుగా సాగుతున్న వైసీపీ రాక్షస పాలనను అంతమొందించి, కూటమి అధికారంలోకి రావాలని, ఎంపీగా పెమ్మసాని, ఎమ్మెల్యేగా గల్లా మాధవి విజయం సాధించాలని మొక్కుకున్న కూటమి నేతలు ఆదివారం ఆ మొక్కుని తీర్చుకున్నారు. రామాలయంటూ గోవిందాలయం పేరుతో సంపత్ నగర్ రామచంద్రాపురం నుంచి పాదయాత్రగా అనంతరం వేంకటేశ్వరస్వామి దేవస్థానం వరకు కూటమి నేతలు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆళ్ళ హరి మాట్లాడుతూ కూటమి విజయం వెనుక దైవానుగ్రహం కూడా ఉందన్నారు. రాష్ట్ర ప్రజలే కాకుండా దేశ విదేశాల్లోని తెలుగు ప్రజలందరూ రాష్ట్రానికి పట్టిన వైసీపీ పీడ విరగడవ్వాలని పెద్దఎత్తున పూజలు చేశారన్నారు. పాదయాత్రలో పాల్గొన్న కూటమి నేతలు కొలసాని బాలకృష్ణ తన్నీరు కృష్ణ, వీరయ్య, సాంబశివరావు, నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. పాదయాత్రలో పెద్ద నాగరాజు, సాంబశివరావు, గల్లా జానకీరామ్, ఆవుల సాంబశివరావు, శ్రీకాంత్, కిషోర్, రామకృష్ణ, గోపి, భవాని, శివారెడ్డి, సుబ్రహ్మణ్యం, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు రామోజీరావు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : తెలుగుజాతి ఉన్నంతకాలం ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత చెరుకూరు రామోజీరావు గుర్తుండిపోతారని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో నివాళులర్పించారు. రామోజీరావు వ్యక్తి కాదు..శక్తివంతమైన వ్యవస్థ అని, స్వయం కృషితో కష్టపడి అనేక రంగాల్లో విజయం సాధించారని కొనియాడారు. రామోజీరావు ఒక పోరాట యోధుడని, ఒక ధ్రువతారలా నిరంతరం వెలుగుతూనే ఉంటారని అన్నారు. దేశంలో యువతకు..భావి తరాలకు ఆయన స్ఫూర్తిగా నిలిచారని, కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించిన ఘనుడు రామోజీరావు అని ప్రశంసించారు. పత్రిక, వ్యాపార రంగాల్లో ఎన్నో వినూత్న ఒరవడులు తీసుకొచ్చారని, భౌతికంగా రామోజీరావు దూరమైనప్పటికీ ఆయన ఆలోచన విధానం, మార్గదర్శనం అందరికీ ఆదర్శ ప్రాయమని అన్నారు. వార్తలను నిర్మొహమాటంగా..నిర్భయంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయనకు ఆయనే సాటి అని, మీడియా, సినీ పరిశ్రమలకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు.

రామోజీరావు మృతికి సంతాపం

విశాలాంధ్ర-గుంటూరు : ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ చెరుకూరి రామోజీరావు అకాల మరణానికి చింతిస్తూ యోగా గురువు ఆళ్ల రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అరండల్‌పేటలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో రామోజీరావు మృతికి సంతాపంగా యోగా సభ్యులు మూడు నిముషాలు మౌనం పాటించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు. యోగా గురువు ఆళ్ల రాజేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నో లక్షల కుటుంబాలను ఉన్నతులుగా తీర్చిదిద్దిన రామోజీ గ్రూపు చైర్మన్ చెరుకూరి రామోజీరావు అకాల మరణం తీరని లోటని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా సాంస్కృతిక విభాగం ప్రధానకార్యదర్శి కూనమనేని వెంకటరమణ, యోగా సభ్యులు ప్రసాద్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న టీడీపీ కార్యకర్తలు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : సార్వత్రిక ఎన్నికలలో చీరాల నియోజకవర్గం నుండి తెదేపా, భాజపా,జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి మద్దులూరి మాల కొండయ్య ఘన విజయం సాధించిన సందర్భంగా స్థానిక తెదేపా నాయకులు మండలంలోని రామకృష్ణా పురంలో కొలువై ఉన్న శ్రీ రాజరాజేశ్వరీ అమ్మవారి దేవస్థానంలో మొక్కులు తీర్చుకున్నారు.అమ్మవారికి 101 టెంకాయలు సమర్పించారు.ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరినీ అమ్మవారు చల్లగా చూసి కాపాడాలని వేడుకున్నారు.అమ్మవారి దయతో కొండయ్య ఆధ్వర్యంలో చీరాల నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలనే ఆకాంక్ష వ్యక్త పరిచారు.ఈ కార్యక్రమంలో గజవల్లి శ్రీనివాసరావు,గోలి దుర్గారావు, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మోదీ ప్రమాణ స్వీకార వేడుకలు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : సార్వత్రిక ఎన్నికలలో ఎన్డీఏ కూటమి విజయం సాధించి మూడవసారి నరేంద్ర మోడీ ప్రధాన మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా మండలంలోని దేవాంగపురి పంచాయితీలో ఉన్న భారతీయ జనతా పార్టీ కార్యాలయం వద్ద వేడుకలు ఘనంగా నిర్వహించారు.మిఠాయిలు పంచిపెట్టారు.నరేంద్ర మోడీ చిత్రపటం ముందు సంబర నినాదాలు చేశారు.కార్యకర్తలకు విందు భోజనం అందించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రం,రాష్ట్రంలోనూ ఎన్డీఏ కూటమి డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పడిందని అభివృద్ధి పథంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రం అగ్ర పథాన నిలుస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.తెదేపా జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుకు,చీరాల నియోజకవర్గ శాసన సభ్యులు ఎం.ఎం కొండయ్యకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు జై శంకర్,రామస్వామి రెడ్డి,మనోహర్ రెడ్డి,పింజల భరణీరావు,మేడికొండ భరణీరావు,కార్యకర్తలు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఈర్ల గంగమ్మకు ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - బల్లికురవ : నక్కబొక్కలపాడు పంచాయతీ పరిధి లోని ఈర్ల కొండ వద్ద వెలిసి భక్తుల పాలిట కొంగు బంగారమై బాసిల్లుతున్న ఈర్ల గంగమ్మకు ఆదివారం భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తులు కోరిన కోరికలు తీర్చే తల్లిగా భక్తులు నమ్మడంతో ప్రతి ఆదివారం చుట్టుపక్కల గ్రామాలే కాకుండా ఇతర జిల్లాల నుంచి వచ్చి అమ్మవారినీ దర్శించుకుని మొక్కులు చెల్లించుకొని అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటారు.

పేదలకు బియ్యం పంపిణీ

విశాలాంధ్ర - బాపట్ల : నవతరం పార్టీ ఆధ్వర్యంలో బాపట్ల అసెంబ్లీ ఇన్‌ఛార్జి షేక్ కరీం పట్టణంలోని 3వ వార్డులో (రాజీవ్ గాంధీ కాలనీ) నివసిస్తున్న పేదలకు ఆదివారం బియ్యం పంపిణీ చేశారు.పేదలకు తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని షేక్ కరీం తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు.ఎన్.గోపాల్, కె.నరేంద్ర,పి.సందీప్ కుమార్ పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన ఇసుకపల్లి దొరగారి బంగ్లా

విశాలాంధ్ర - రేపల్లె : పట్టణంలోని ఇసుకపల్లి ఆంధ్ర లూథరన్ సంఘ పరిధిలో 26 ఎకరాల విస్తీర్ణం ఉంది.ఈ విస్తీర్ణంలో ఉన్న కే.ఎన్.హెచ్ హాస్టల్,దొరల నివాస యోగ్యమైన బంగ్లాతో సహా బీటలు భారీ శిథిలావస్థకు చేరినప్పటికిని ఆ బంగ్లా మరమ్మతుల విషయంలో సంఘం తగు శ్రద్ధ చూపకపోవడంతో ఆ భవనాలు నిరుపయోగంగా మారాయి.కోట్ల రూపాయల విలువైన ఈ భూమిని స్థానిక సంఘ స్థులకైనా లీజుకు ఇస్తే వారు ఆ స్థలాల్లో పూల తోటలు, కూర గాయ తోటలు,పాడి పరిశ్రమ,లాంటి పరిశ్రమలు పెట్టుకుని సంఘ స్తులు జీవనం సాగిస్తారు. దీనితో సంఘానికి ఆదాయం చేకూరినట్లు అవుతుంది.సంఘస్తులకు ఆర్థిక వెసులుబాటుతో జీవనం సాగించటానికి అవకాశం ఉంటుందని స్థానిక సంఘస్తులు వెల్లడిస్తున్నారు.దొరలను సాగనంపి వంద సంవత్సరాలు గడుస్తున్నా ఈ భూములలో పిచ్చి మొక్కలు,ముళ్ళ చెట్లు,పాముల పుట్టలు తప్పా ఎలాంటి అభివృద్ధికి నోచుకోవటం లేదని పట్టణ ప్రజల విమర్శ ఉంది.

ఘనంగా ఎస్టీయూ 78వ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ఎస్టీయూ ఏపీ 78వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బాపట్ల జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు బడుగు శ్రీనివాసరావు ఎంఈఓ ఆఫీస్ వద్ద ఎస్టీయూ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీచర్ల బదిలీల విషయంలో వెబ్ కౌన్సిలింగ్ విధానాన్ని రద్దు చేసి మ్యాన్యువల్ విధానం ద్వారా బదిలీలు చేపట్టాలని, పీఆర్సీ, డి.ఎ,ఏపి జి.ఎల్.ఐ.సి, సరెండర్ లీవ్ బకాయి లను విడుదల చేయాలని కోరారు. కరోనా సమయంలో చనిపోయిన ఉపాధ్యాయ కుటుంబాలకు క్యాంపస్సేటివ్ ఉద్యోగాలు ఇవ్వాలని నూతనంగా ఏర్పడుతున్న ప్రభుత్వాన్ని కోరారు. 2024 జులై నుండి పీఆర్సీ ప్రకటించి అమలు చేయాలని, జిఓ నంబర్ 117ను రద్దు చేయాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఉదయ్‌శంకర్, బి.వెంకటేశ్వర్లు, పివి నాగరాజు,గవిని శ్రీనివాసరావు, ఎన్. బి సుభాని, నారాయణ,తోటకూర వీరాంజనేయులు, వెంకటరంగం,ఎస్.ఏసుదాసు పాల్గొన్నారు.

'అనగాని' గెలుపుతో స్వీట్లు పంపిణీ

విశాలాంధ్ర - రేపల్లె : సార్వత్రిక ఎన్నికలలో రేపల్లె శాసనసభ నియోజకవర్గం నుండి 40,000 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందిన ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ రేపల్లె మండలం పేటేరు గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు రెబ్బా కోదండరామ్ గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఆదివారం గ్రామంలో ఉన్న అన్ని చర్చిలలో ప్రార్థన సమయంలో స్వీట్స్‌ను పంచిపెట్టారు.ఈ సందర్భంగా పాస్టర్లు ఆయా చర్చిలలో ఎమ్మెల్యే విజయాన్ని కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు పుసులూరు కోటేశ్వరరావు,గోలి రామ శేషగిరిరావు,దీవి సురేష్,వెంకటేశ్వరరావు,డివిఎన్ఆర్ శాస్త్రి,గ్రామ టీడీపీ వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

రామోజీరావుకు ఘన నివాళి

విశాలాంధ్ర - చెరుకుపల్లి : పత్రికా రంగంలో విశేషమైన సేవలను అందించి,పలు వ్యాపారాలలో రాణించి బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరు గడించిన చెరుకూరి రామోజీరావు మరణం తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు అని మండల తెదేపా అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ అన్నారు.రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఆదేశాల మేరకు మండల పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి సాధారణమైన కుటుంబంలో జన్మించిన రామోజీరావు అంచెలంచెలుగా ఎదిగి ఎందరికో ఆదర్శప్రాయుడయ్యానన్నారు.ఎన్నో సేవా కార్యక్రమాలతో పాటు భారతదేశానికి తలమానికంగా ఉన్న రామోజీ ఫిలిం సిటీని నిర్మించి తెలుగువారి గొప్పతనాన్ని ప్రపంచానికి చాటాడన్నారు.ఎన్నో విజయవంతమైన చిత్రాలను నిర్మించి మంచి నిర్మాతగా పేరు గడించాన్నారు.అంతే కాకుండా కేంద్ర ప్రభుత్వం అందించే అతిపెద్ద పురస్కారం పద్మభూషణ్ సాధించిన మహా మనిషి రామోజీరావు అన్నారు. అనంతరం రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో పట్టణ తెదేపా అధ్యక్షుడు నాగుల పున్నారావు,దుర్గాప్రసాద్,గాదే సాంబయ్య,ఎస్సంశెట్టి శ్రీనివాసరావు,ఏనుగుల కోటేశ్వరరావు,మేము మోహన్ బాబు,రమణ మాస్టారు,కుంభ శివయ్య పాల్గొన్నారు.

అనాధ శరణాలయంలో అన్నదానం

విశాలాంధ్ర - వేటపాలెం : మండల పరిధిలోని దేశాయిపేట పంచాయతీ నీలకంఠాపురం నందుగల అనాధ ఆశ్రమంలో తెలుగుదేశం బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నాసిక వీరభద్రయ్య ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది.మద్దులూరి మాల కొండయ్య అఖండ విజయం సాధించిన నేపథ్యంలో ఆయనకు మంత్రి పదవి రావాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టానని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు బాలకృష్ణ జనసేన నాయకులు హర్ష,కిరణ్ తేజమణి,శివ,కత్తుల మనోజ్, పిచ్చుక వెంకట సుబ్బారావు,గ్రంధి నాగాంజనేయులు, జగదీష్, కూటమి అభ్యర్థులు పాల్గొన్నారు.

మహిళల స్వావలంబనకు ఫ్యాబ్రిక్ డిజైనింగ్ దోహదం

విశాలాంధ్ర -పర్చూరు: మహిళల స్వావలంబనకు ఫ్యాబ్రిక్ డిజైనింగ్ దోహదపడుతుందని రోటరీ అధ్యక్షులు నాగభైరు శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక రోటరీ భవన్‌లో ఆదివారం రోటరీ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత ఫ్యాబ్రిక్ డిజైనింగ్, పెయింటింగ్ శిక్షణా కార్యక్రమం సామాజికవేత్త నర్రా లక్ష్మీసుధ సౌజన్యంతో ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీసుధ మాట్లాడుతూ మహిళలు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రోటరీ ప్రతినిధులు కొల్లా నరేంద్రకుమార్, గడ్డిపాటి శ్రీనివాసరావు శిక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి సదానందరెడ్డి, ప్రతినిధులు కోమటి ఆంజనేయులు, కుట్టు శిక్షణ నిపుణురాలు దగ్గుబాటి రాజ్యలక్ష్మీ, శిక్షణ మహిళలు ఉన్నారు.